
# మావూరు

—రాణి శివశంకర్




"అమ్మా! సాయిబాబుగారొచ్చారే" త్రిమూర్తులు పిలుపుకి బుల్లమ్మాయి గుడిసెలోంచి పరుగు లాంటి నడకతో బయటికి వచ్చింది. "ఎన్నేళ్లయింది బాబూ మిమ్మల్ని సూసి! నల్ల పూసైపోయారు. అమ్మగారు కూలాసానా? నాన్నగారెలా వున్నారు? ఆయనకా పాడురోగమేంట్రో బాబూ, దేవుడు. అన్నట్టు గుళ్లో ఆచారిగారబ్బాయి పోయారు మీకు తెలిసిందా?"

దేన్నీ కృత్రిమంగా క్రమబద్ధం చేసే అతి తెలివి నాగరికతాలేని ఆమె మాటలు, కొబ్బరి ఆకుల గలగలలు. "బుల్లమ్మాయిని తప్పకుండా కలు. అడిగి నట్లు చెప్పు" మా వూరు వెళ్తున్నానని చెప్పగానే అమ్మ మొదటి మాటలివే. బుల్లమ్మాయి మాయింట్లో పనిమనిషిలా ఎప్పుడూ లేదు. మా కుటుంబంలో కలిసి పోయింది. మా కష్ట సుఖాలతో పెనవేసుకు పోయింది.

అప్పుదు మేం చాలా చిన్న వాళ్లం. బుల్ల మ్మాయి మొగుడు ఎం్రడిన్ తాగి చచ్చిపోయాడు. బుల్లమ్మాయిని అమ్మ ఓదార్చేది. అన్నం పొండి పంపేది. ఆ విషాదం మాఇంట్లోకి కూడా పాకింది. పీడితులు కావడం వల్ల సహజంగానే స్త్రీలు పురుషుల కంటే ఆర్ద్రంగా వుంటారేమో. పురుషుల ప్రపంచం వేరు. వాళ్ల విశాలమైన ప్రపంచంలో యిరుకుగా ముళ్లుగా బ్రతుకుతారు.

స్త్రీలు యిరుకైన పరిసరాల్లో విశాలంగా వికసిస్తారు. "అమ్మ గారు దేవత" మా చుట్టుపక్కల పూరిపాకల్లోని జనం అనేవారు. కాని మానాయన ప్రపంచం వేరు.

# చినుకు చిత్రాలు



ఆడే నెమలి కన్ను
ఆవంతాకాశాన్ని కప్పింది
ఆకు కొసన వ్రేలాడే నీటి చుక్క
అంతటి సూర్యుణ్ని మింగింది

ఎండా కాలానికి వెలక్కాయలా
గట్టిపడిన భూగోళం
వాలుగు చినుకుల హర్షానికే
సపోటాలా మెత్తబడిన నైనం

ఎప్పుడో పక్షి ముక్కున రాలిపడిన సగం గింజ ఒకటి
మట్టి గోడ చానల్లో ఆకుపచ్చగా ప్రసవించిన దృశ్యం
తొందరించే చినుకుల త్రొక్కిళ్ళలో బురదజారే
పొలం భూమి అల్కేమీ సదృశం

ఆకాశం అంబుధిని తడుపుతున్నప్పుడు
వృద్ధుడైన సముద్రుడ్ని
వృద్ధి పొందిన సంతానం
వేల చేతులతో ఆదుకునే
ఆర్ద్రమైన అనుభవం

రాళ్ళ క్రింద మట్టి పొరల్లోంచి, పర్వతాల తలల మీదుగా
రాలే పూదుల్లాంటి చినుకులు ఆకుపచ్చ తివాచీలు ఎన్నెన్నో అల్లి
వన భోజనానికి ఆహ్వానిస్తున్నవి, చిన్నకాక మొన్న ఆకులు తొడిగిన చెట్లన్ని

అప్పుడప్పుడు ఆకాశం తళుక్కున చీలినప్పుడు
జలదరించే మబ్బుల గర్జనల గమకం;
చిందరవందరైన చెట్ల గుబురులు
తలలూపుతూ; తలలంటుకునే సన్నివేశం
ఇక సామూహిక స్నానాల్లో సరదాపడే పక్షులకు
ఒక్క చినుకు చెంబెడు నీళ్ళై తడపడం

మబ్బుల రథాల నెడుతూ
మేఘుడు జారవిడ్చుకున్న జరీ కండువా
కొండపై నుండి, మడి పొలాల వరకూ తగిలింది
ఆహ్లాదంగా రెక్కలల్లార్చే తెల్ల కొంగల షేర్వాణీ దర్జా
అక్కడే తిరిగి వాలింది
చినుకు చినుకు చిన్నబడి
వర్షం క్రమేపీ సన్నగిల్లింది.

—పి. రావ్ నారాయణ్

ఆయన ఎప్పుడూ వేదాంతం వల్లిస్తూండేవాడు. వృద్ధులూ, యువవృద్ధులూ, పెద్ద మనుషులూ, ఇంగ్లీషు చదువుల్చదివి వున్న మతి పోయిన బట్ట తలలూ ఆయన చుట్టూ చేరి మెట్ట వేదాంతం వల్లించేవారు. ప్రపంచం మిధ్య అని పెదవి విరిచే వారు. ఎక్కువ కాన్పుల వల్ల, మితిమీరిన పని వల్ల, నిస్సారమైన జీవితం వల్ల అమ్మ చాలా బలహీన పడి పోయింది. ఏకాంతంలో దిగులుగా మూల్గేది. "నాదీ వొక బతుకేనా?" మా నాయనని సన్మానించే సభల్లో ఎవరైనా అమ్మ పేరు స్మరిస్తారని ఎదురు చూసేవాడిని. ఎంత మంది ఏ వేళకి దిగినా వండివార్చి కడుపు నిండా భోజనం పెట్టిన సంగతిని వాళ్లంత ముఖ్యమైందిగా భావించేవారు కాదు. స్త్రీ శ్రమను గుర్తిస్తే యీదిక్కుమాలిన వేదాంతాలూ, శాస్త్రాలూ, కుటుంబాలూ కొట్టుకు పోతాయి చట్ట బద్ధమైన హింసే కుటుంబం.

"మీరు పెళ్లి చేసుకొని కోడలమ్మని తీసుకొస్తే అమ్మగారు కాలు మీద కాలేసుక్కూకోచ్చు. ఎప్పుడు బూరెముక్క తినిపిస్తారు?" అడిగింది బుల్లమ్మాయి. " తొందర్లోనే. పది పదిహేను సంవత్సరాల్లో" నా సమాధానానికి నవ్వలేక చచ్చింది." బేబీగారెలా వున్నారు" "అలాగే" పెద్దక్క బేబీ, ఆస్పత్రిలో నర్సు 'బేబీ' అని పిలవడం చూసి, అమ్మ ఆ పిలుపే కొనసాగించిందట.

గౌరవ మర్యాదల కోసం మానాయన బేబీకి 12 వ యేటనే వైభవంగా పెళ్లి చేశాడు. పెద్ద మనుషులు మెచ్చుకొన్నారు. జ్యోతిష్కులు మంచి ముహూర్తం అద్భుతమైన దాంపత్య జీవితం అన్నారు. పీఠాధిపతులు ఆశీర్వాదాలు పంపారు. చిన్న తనంలోనే పిల్లవాణ్ణి కని పిచ్చిదైపోయింది. ఇరుగు పొరుగు పూరిపాకలలోని జనం కంట తడి పెట్టారు. సోవాలమ్మ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. "దేవుడా ఎటువంటి బిడ్డనెలా సేశావ్?" మా నాయన మూల్గాడు "అంతా ఖర్మ. నుదుటి రాతనెవరూ మార్చలేరు" ఆయన భాగవత పారాయణ మొదలు పెట్టాడు. భూత వైద్యుడు కోడిని కోశాడు. నాటు వైద్యుడు చేతనైనది చేశాడు. చివరికా రోగం కుటుంబ మర్యాదకీ గౌరవానికి, పవిత్రమైన అజ్ఞానానికి చిహ్నంగా నిలిచిపోయింది. బుల్లమ్మాయి అంది "బంగారు బొమ్మ బాబూ. ఆ పాడు రోగం వచ్చి....." "ఆ రోగం వెతుక్కుంటూ వచ్చిందా బుల్లమ్మాయ్" త్రిమూర్తులు బొందం కొట్టేచ్చాడు. చల్లని నీళ్ళు.

దోవలో ఎంతో మంది పలకరించారు. నిజమైన ఆత్మీయులు, సత్తెయ్య,సోవాలమ్మ, వెంకమ్మ, ఎల్లయ్య... దొంగ వేషాల్నీ, నటనల్నీ, మర్యాదల్నీ చదువుకోని స్వచ్ఛమైన జనం. ఎంత ప్రేమాస్పదమైన నేలమీదికి తిరిగి వచ్చాను? గిన్నెలు, కరచాలనాలు, దొంగనవ్వులు, కులగజ్జి సోకిన మర్యాదస్తుల చర్మాలు, ఏ విజ్ఞానాన్నీ హృదయ వైశాల్యాన్నీ యివ్వలేక పోయిన చదువులతో మిడి మిడి జ్ఞానంతో నట్టిపోయిన నాగరిక పశువులు, ఇళ్ల గుల్లలు, జ్ఞాన గవాక్షాలు లేని బట్టీ విద్యాలయాలు, పైపై పూతల ముఖాలు, కుళ్లిన నాగరికత పెంట కుప్పలోంచి పుట్టుకొచ్చిన మానవ క్రిములు...ఆ చెత్త కంతకీ దూరంగా యీ నేల మీదకి ...స్వచ్ఛమైన గాలిలోకి.

అదే మేమప్పుడుండే యిల్లు. ఇప్పుడది ఖాళీ. ఇప్పటికీ ఆయింటి చుట్టూ శర్మ గారితో పాటు దిగులుగా వీస్తున్నట్లే వుంటుంది. శర్మ మరణించిన కొన్ని రోజుల తర్వాత కూడా పెరట్లోని చెట్ల ఆకుల గలగలల్లో శర్మ మూల్గులే వినిపిస్తున్నాయని మావాళ్లనే వారు. శర్మ మరణం వొక మిస్టరీ. హుషారుగా చలాకీగా యెప్పుడూ నవ్వుతూండే శర్మ వొకరోజున హఠాత్తుగా అసందర్భంగా ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించడం.

శర్మ మాపక్క వాటాలోని హైమవతీశంగారి దత్తుడు. ఇంట్లో వాళ్ల ఆచారాల్ని, చాదస్తాల్ని లెక్క చేసేవాడు కాదు. కులభేదాల్ని పట్టించుకోకుండా యింటికి మిత్రుల్ని భోజనానికి తీసుకు వచ్చేవాడు. అతని తల్లి మొత్తుకొనేది. " నా పద్ధతులు మీకు నచ్చక పోతే, యింటి నుంచి పోతాన"నేవాడు. హైమవతీశం అతని కోసం చాలా రాజీ పడ్డాడు. అతని ఉద్రేకస్వభావాన్ని గ్రహించి ఏ అఘాయిత్యానికి దిగుతాడోనన్న

భయంతో కులాంతర వివాహమైనా అభ్యంతరం లేదని ముందే చెప్పేశాడు. కాని శర్మని యీ ప్రపంచంలో నిలపలేక పోయాడు.

అందరూ వూరెళ్ళారు. శర్మ వొంటరిగా మిగిలాడింట్లో. తెల్లారి ఎప్పటికీ తలుపు తెరవక పోవడంతో గోడమీంచి లోపలికి దూకి తలుపు తెరిచారు. శర్మ నిక్కరులో బోర్లా పడున్నాడు.

నేలమీద వొళ్ళంతా నల్లబడి పోయింది. పక్కనే నిద్రమాత్రలు. బైట హోరుమని గాలి, వర్షం.

ఇల్లు మైలపడి పోతుందని అతన్ని అరుగు మీద జేర్చారు. కొనవూపిరితో వుండగానే. కొందరు బంధువులు యింటికి రాగానే అడిగిన ప్రశ్న. "శర్మ యింట్లో పోయాడా, బయట పోయాడా?"

అంతా తొందర తొందర. పోలీసుల భయం వాళ్ళకి ఉప్పందితే అనవసరమైన ప్రశ్నలూ, ఎంక్వైరీలూ. కర్ణానికి లంచమిచ్చి, ఆ రోజే శవదహనం చేసేశారు.


ఊళ్ళోకి అడుగు పెట్టగానే అందర్నీ అడగాల నిపిస్తోంది. శర్మ గుర్తున్నాడా మీకు? అన్నిటినీ ప్రశ్నించే ధిక్కరించే హుషారైన చలాకీయైన శర్మ ఉత్సాహం ఆకారం ధరించిన శర్మ. ప్రథమ యౌవనంలోని గుడ్డి ప్రేమ కోసం బలైపోయిన శర్మ. ప్రతిదాన్ని తూచి వెలగట్టే యీ వెధవ ప్రపంచంలో వొక **అమ్మాయి** కోసం కృశించి తపించి **అంతరించి పోవడాన్ని** ఎలా తేలికగా తీసుకోగలం?

శర్మ **చాలా మొండిగా వుండే** వాడు. ధిక్కరిస్తూ **బతికేవాడు. దత్తు తీసుకొని** దరిద్రం నుంచి బైటికి లాగి వారసత్వంగా యివ్వబోతున్న సంపదకి ఎప్పుడూ కృతజ్ఞత చూపేవాడు కాదు.

అటు వంటి శునక లక్షణం ఏదీ అతనిలో లేదు. అతనిది ధిక్కార స్వరం.

అప్పుడందరూ చెప్పుకొనే సంగతి వొకటుంది. శర్మకి వొక అమ్మాయితో గల సంబంధం గురించి వెకిలిగా ప్రచారం చేశాడొకడు. పుట్టిన రోజు పార్టీ అని వాణ్ణి ఊరి చివరికి తీసికెళ్ళి అక్కడున్న చిన్న హోటల్లో బాగా మేపాడు. తర్వాత సొంత తోటలోకి బొండా లిప్పిస్తానని తీసికెళ్లాడు.

అక్కడ వాణ్ణి తిన్నది కక్కేదాకా తన్నాడు. వాడు అన్నవన్నీ చెప్పి "బాబోయ్ ఇంకెప్పుడూ నోరు జారన"ని లెంపలేసుకొన్నాడు. అదీ శర్మ. శర్మంటే గుర్తుకు వచ్చేది యింటా బయటా అతని ధిక్కారమే. ఇంకాసరైన లక్ష్యంలేని ధిక్కారం. దేవుడికి, దెయ్యాలకి, పెద్దవాళ్లకి కనబడే ప్రతిదానికి భయపడ్తూ నక్కి నక్కి బతకడం ఆదర్శంగా భావించే ఛాందస కుటుం



బంలో జన్మించిన నన్ను అతని ధిక్కార స్వరం భయపెట్టేది.

"చచ్చాక తలకొరివి పెట్టే వాళ్లుండాలి కదా" అని భార్య పట్టుబట్టడంతో యిష్టం లేక పోయినా దగ్గర బంధువు కొడుకునే దత్తత తీసుకొన్నారు హైమవతీశం. వాడెప్పుడూ మద్రాసులోనే వుండే వాడు. రెండు మూడు సంవత్సరాల కొకసారి వచ్చేవాడు. "బోర్. వెధవ పల్లెటూర"ని మూల్గుతూ ముచ్చటగా మూడు రోజుల గడిపి పోయేవాడు. తర్వాత అసలు రావడమే మానే శాడు. హైమవతీశం గారు పోయాక వచ్చి తల కొరివి పెట్టి ఆస్తి అమ్ముకొని డబ్బు సంచితో పోయాడు. మద్రాసులో పెద్దయిల్లొకటి కట్టు కొన్నాడట.

నేను కనబడగనే సుబ్బలక్ష్మి పెదవులపైన నీరసమైన చిరునవ్వు. మునుపటి వుత్సాహం ఏమీ మిగల్లేదు. మా అక్కయ్య ప్రియ స్నేహితురాలు, మేస్త్రీకి వొక్కతే కూతురు. ఆడపిల్లలా చెవికి రంగు లేమిటని నా చెవి పోగులు కత్తిరించేసినది సుబ్బలక్ష్మే. ఎప్పుడూ హుషారుగా చలాకీగా నవ్విస్తూండేది. వొక టీచర్ని ప్రేమించింది. ఇంట్లో వాళ్ళు అంగీకరించలేదు. ఎప్పుడూ యిల్లు దాటి ఎరుగని ఆమెకి తల్లి దండ్రుల మాటకి ఎదురు తిరగాలనే భావమే కలుగలేదు. ఇంట్లో చెప్పినట్లే వొక కొబ్బరి వ్యాపారిని పెళ్ళి చేసుకొంది. చాలా నిరుత్సాహం. తిండి తినేది కాదు!" ఆ దేవుడో పెద్ద వెధవ. మనుషుల్ని పనికి మాలిన వాళ్లని చేశాడు" అని దేవుణ్ణి తిట్టి పోసేది.

తీవ్రమైన దైవ ద్వేషం. తర్వాత సర్దుకు పోయింది. భర్త ప్రయోజకత్వాన్ని పిల్లల్ని చూసి సంతృప్తి పడడం నేర్చుకొంది. లావుగా బొద్దుగా వుండే ఆ పిల్లల్ని చూసి నేనొక సారి "ఘనపాఠీలు" అన్నాను నవ్వింది.

కానియిప్పుడు చాలా మారి పోయినట్లు కనిపించింది. దైవ భక్తురాలై పోయింది. "బాబా వారి ఆశ్రమాని కెళ్ళాను. చాలా శాంతి. ఈ వెధవ ప్రపంచాన్ని సంసారాన్ని మర్చిపోచ్చు"

"అది సరే మీ ఆయన వ్యాపారం ఎలా వుంది"

"దివాలా తీసింది."

"సాయిబాబుగారూ ఎప్పుడొచ్చారండి" సత్తిపండు. "గంటైంది. అరే నిన్ను గుర్తు పట్టడమే కష్టంగా వుంది. లావెక్కావ్. గుర్రబ్బండేది?"

"అమ్మేసి సాన్నాళ్లైందండ్"

మేం అతని గుర్రబ్బండిలోనే ముక్కామల డొక్కుటాకీసుకి సినిమా కెళ్లే వాళ్లం. ఆ యిరుకైన బండిలో మా కుటుంబమంతా జేరడంతో వూపిరాడక చచ్చేవాళ్లం. దార్లో సత్తిపండు విచిత్రమైన యింగ్లీషులో ఏదేదో మాట్లాడి నవ్విస్తూండేవాడు. "దిస్ సినిమా ఇంటరెస్టింగండి. కృష్ణా జయప్రదాటాప్ మేచ్ అండీ సూపర్ హిట్" ఇలా.

"ఇప్పుడూ ఇంగ్లీషు మాట్లాడుతున్నావా" అని అడిగా. గలగలా నవ్వాడు. వెన్నెలలో కాలవ గలగలతో శ్రుతి కలుపుతున్న టిక్‌టిక్ టిక్ డెక్కల చప్పుడు యింకా వినిపిస్తూనే వుంది అతనిని చూస్తుంటే.

"సుబ్బలక్ష్మి సంగతేమిటి?"

"ఆయన వన్నీ ఎదవ అలవాట్లే. ఇల్లు గుల్లై పోనాదండి"

వంశీ ప్రస్తావన వచ్చింది. "ఎప్పూడూ బండి జోరుగా నడిపేవారండి. నిమ్మదిగా ఎల్లమన్నా ఇంట్లో వాళ్ళ మాట సెవిన పెట్టారు కాదండి. లారీ గుద్దుకు పోయారండి"

వంశీ పూజారి కొడుకు. బాగా ఆస్తి వుంది. అతనికి చదువుకోవాలని వుద్యోగం చేయాలని ఉండేది. దూర మౌతాడనే భయంతో చదువే వద్దనేవాడు తండ్రి. స్వంత వ్యక్తిత్వం ఏర్పడితే కొడుకు తనకు కాకుండా పోతాడనే భయం. అందుకే ఆయనకి వంశీ అభిరుచులు స్నేహాలు ప్రతి కదలికపైన సందేహమే. గుడిలో పూజ, పొలం పని తప్ప మరేదీ నచ్చేదికాదు. తండ్రి ప్రభావానికి కుంగిపోయి ముడుచుకు పోయి నట్లుండేవాడు వంశీ. ఎవరేమనుకొంటారోననే భయం. ఆత్మవిశ్వాసం తక్కువ. విచిత్రం శర్మ వంశీ మిత్రుడు. ఇద్దరూ భిన్నధ్రువాలు. ఇంటా బయటా ఎవర్నీ లెక్కచేయని శర్మ విశృంఖల వ్యక్తిత్వానికి ఆకర్షితుడై అతనికి దగ్గరయ్యాడేమో, శర్మ పోయినపుడు చాలా కుంగి పోయాడు. ఆత్మహ

త్యకు ప్రయత్నించాడు కూడా. తర్వాత వైద్యం నేర్చుకొన్నాడు. పేదవాళ్ళకి వుచితంగానే వైద్యం చేసేవాడు. అలా చాలా మంది చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు దగ్గరయ్యాడు. **అదో** ఆత్మతృప్తి. ఆత్మబలం. అతడు **పోయినపుడు** వేలాది మంది అతని యింటి చుట్టూ **చేరారు.** 'వంశీ దేవుడండి' అన్నాడు **సత్తిపండు.**

"కులాసానా సాయి, యిప్పుడేం **చేస్తున్నావ్**" కామరాజు మాస్టారు. "టీచరుగా **పనిచేస్తున్నా** నండి" "చివరికి నువ్వూ టీచరువే **నన్నమాట.** ఏదో ఒక వుద్యోగం. ఈ కాలంలో **అసలు** వుద్యోగం రావడమే మహాభాగ్యం."

నాలుగో సారీ ఆడపిల్లే పుట్టి నపుడు మంచ మెక్కారు కామరాజు మాస్టారు. ఇప్పుడు పిల్లలు పెద్ద వాళ్లయ్యారు. మట్టి అరుగుల యిల్లు మరింత పేదగా దిగులుగా కనిపిస్తోంది.

"ఎప్పుడొచ్చావు సాయి" వంటింట్లోంచి వస్తూ సుధ. కొద్దిసేపు కబుర్లు, క్షేమ **సమాచా** రాలు, గతస్మృతులు, మనస్సుపై **మెరుపుల్లాంటి** చిరునవ్వు సిరులు.

దోస్తులతో కలిసి చిన్నతనంలో నాటకాలు **వేసే** వాడిని. నేనే డైరెక్టర్ని, రచయితని, **హీరోని,** ఇరుగు పొరుగు అమ్మాయిలే నటులు. **అరుగే** స్టేజీ. ఒకసారి సుధ రాజుగా నేను **రాణిగా** వేషాలు వేశాం. బంతిని కోసి స్తనాలుగా **అతి** కించు కొన్నాను. తలకి సవరం వేలాడ దీశాను.

"**రాణీ**" ఏమిటి రాజా" "**రాణీ**" చెప్పుము రాజా" '**రాణీ**' యింకా మూల్గుతూనే వుంది రాజు. "**ఏమిటో** చెప్పి తగలడు" విసుక్కొన్నాడు **రాణి.** కింది నుండి నవ్వులు ఎవ్వరిదో ఈల. "డైలాగులు మర్చి పోయాను రాణీ" రాజుని ఒక తాపు తన్ని ఉక్రోషంగా సవరం పీకి విసిరేసి ఏడుస్తూ పరుగు. ఆ సంగతి గుర్తు చేశాను. "నువ్వు రాజుగా నేను రాణిగాను వేస్తే డైలాగులు వంతటవే పొంగి వచ్చేవేమో" అంది సుధ నవ్వుతూ.

**ఊరు** చాలా మారిపోయింది. ఇళ్లూ పూరి పాకలూ పెరిగాయి. గోడలపై మత నినాదాలు. గుళ్లో కర్రసాము నేర్పుతున్నారట. గల్ఫ్ యుద్ధం గురించి ఆవేశంగా మాట్లాడుతూ ఆవొక్క యిల్లు లేపేస్తే పీడ వదుల్తుందంటున్నాడొకడు.

ఆచింత చెట్టు దగ్గర ఒక శిథిలాలయం వుండేది. రెండు చెక్క విగ్రహాలు దుమ్ములో ధూళిలో పడుండేవి. శ్రీ రామ నవమికి మాత్రం వాటిని దుమ్ము దులిపి వుత్సవం జరిపేవారు. మర్నాడు మళ్ళీ అదే గతి. ఆ గుడే మాట్లు వేసే వాళ్ళ కాళ్ళూనా, నివాసం. కాని యిప్పుడక్కడ అందమైన ఆలయం. బీదదే వుడు ధనవంతుడయ్యాడు.

"కిష్టుడూ రాముడూ అంటే ఎవడూ పల కటం లేదండి తల పొగరండి. బళ్లోనూ ఆళ్లే, సంస్కృత పాటశాల్లోనూ ఆళ్లే నండి. ఆ వెదవలకి తమలా నోరు తిరిగేడుస్తదాండి. నేను నా ఓటల్లో సచ్చినా కాపీ యివ్వనండాల్లకి" రామయ్య పూరిపాక అలాగే వుంది. కులగర్వం మాత్రం ముదిరింది.

ముత్యాలమ్మ జాతర. గరగలు వూరేగుతున్నాయి. బాగా తాగి గెంతుతున్నారు డప్పుల చప్పుడు కనుగుణంగా. నా చిన్న తనంలో ఒక స్వామీజీ వచ్చాడు. అహింసే ధర్మమని బలులొద్దన్నాడు. ఊరంతా భక్తులయ్యారు. పాద పూజలు చేశారు. చివరికి భక్తిని అజ్ఞానాన్ని డబ్బుగా దండుకొని వూరి నుంచి పారిపోయాడు.

అమ్మ చెప్పేది, బలివేస్తుంటే చూడకూడదని, అమ్మ వారికి కోపం వస్తుందని. గుడికి వెళ్ళొస్తుంటే, వేప చెట్టు దగ్గర డప్పులమోత. మెళ్లో వేపదండ. మేక భయంగా పారిపోవాలని చూస్తోంది. అమ్మ చూడకూడదని చెప్పిన మాట గుర్తుకు వస్తూనే వుంది. వద్దనడం వల్లనేనేమో చూడాలనిపించింది. మేక మెడ మీద కత్తివేటు. దెబ్బకి కిందపడి గిలగిలా తన్నుకొంటోంది. వెనక అమ్మవారి గజ్జల చప్పుడు వినిపిస్తున్నట్లనిపించింది. అమ్మ కంతా **చెప్పాను** భయంగా. "ఎందుకు **వెళ్ళావురా** **నాయనా.** వద్దని చెప్పాను కదా" దిష్టి **తీసింది** **అమ్మ.** అమ్మ వారంటే అందరికీ **భయమే.** **భయంకరమైన** దేవత. నానాయన **మాత్రం** "**క్షుద్ర**దేవత" అనేవాడు.

ఆ సంగతి ఒకసారి అన్నయ్య దగ్గర ప్రస్తావించాం "పెద్ద వాళ్ళ వాదస్తాల్ని మనం పట్టించు **కో**కూడదు. దేవుణ్ణి అనేక రూపాల్లో పూజి **స్తారు** ఏకాగ్రత కోసం. ఏ దేవుడైనా **ఒకటే**" **అన్నాడన్నయ్య.**

"ఐతే క్రీస్తు అల్లా కూడ...."

"పిచ్చి ప్రశ్న" అని విసుక్కొని "అన్ని ధర్మాలకన్నా మతాల కన్న హిందూ ధర్మం గొప్పది." అన్నాడు. ఇంతలో బేబీ తనలో తనే వాగుకుంటూ గదిలోకి వచ్చి, అరుస్తూ వెళ్లి గోడకి **తగిలించిన** జగద్గురువు పటాన్ని నేలకేసి కొట్టింది.

మిత్రులతో కలిసి కాలవ వొడ్డున చలిమంట దగ్గర చేరా. చల్లని గాలి, వెచ్చని చలిమంట. **విషాదానందాల** స్మృతులు సమ్మిళితమైన వాతావరణం. నక్షత్రాలు దూకుతున్నాయి కాలవ **లోకి.** ఆ సహజ ఆత్మీయ ప్రపంచంతో ఏదో బంధం కోసం లోపల తహతహ. కాని అను**భూతులని** ఆలోచనలని వాస్తవాన్ని ఐక్యం చేసే సహజ సూత్రమేది? బహుశా అది బాల్యంలో... కాదు. అమ్మ గర్భంలో.... కాదు. దాన్నెవరో ఎపుడో పుటుక్కున తెంచేశారు.

కాలవలో వెన్నెల. కొబ్బరి చెట్లు నీళ్ళలో మొహం చూసుకొంటున్నాయి. ఆ నల్లని నీడలు లోతులోకి చొచ్చుకు పోతున్నట్లున్నాయి. ఒకపుడు రోడ్డు కిరువైపుల నిలబడి గొడుగు పట్టిన మర్రి చెట్లని కొట్టేశారు రోడ్డు వెడల్పు చేయడం కోసం. ప్రదక్షిణ చేస్తే పుణ్యమనిఒక బ్రాహ్మడు కాలవొడ్డున నాటిన రావిచెట్టు బతికే వుంది. ఆయన ఎప్పుడో పోయాడు. కొబ్బరి చెట్లపైన కోతులు వూర్లో **జనాభాకంటె** ఎక్కువగా వుండేవి. రైతులు తరిమేశారు. **చిన్నవీ** పెద్దవీ ప్రధానమైనవీ అప్రధానమైనవీ **చాలా** మార్పులు. ఏది మార్పుల కతీతం? **లాంచీ** రేపే అలల్లో కాళ్లని వుంచడం ఎంతో వింతగా కొత్తగా వుండేది. తెల్లారుజామునే స్నానాలు, కార్తీక దీపాల తోరణాల్ని చూస్తూ, గ్రహణమైతే అందరం అక్కడే. ఐతే ఆ కాలవ చుట్టూ ముసిరిన గుడ్డి **విశ్వాసాల్ని** నానుంచి కాలం ఎప్పుడో తరిమేసింది. ఇప్పుడా కాలవని ఒక కొత్త దృష్టితో చూస్తున్నాను. నిత్య నూతన వాహినిగా. కాలవ ప్రవహిస్తోంది. కాలం ప్రవహిస్తోంది. ఊరూ ప్రవహిస్తోంది. ●

## సాదృశ్య సాగరం

టాంక్ బండ్ మీంచి నా చూపు
హుసేన్ సాగర్లోకి దిగి తెరచాప విప్పుకుంటుంది.
అంతులేని యీ నీటి ఎడారి
గాయాలు గాయాలుగా విస్తరించినట్లనిపిస్తుంది.
నల్లని తారు అలల యీ చెరువు
కామత్ హోటల్ ముందు దువ్వెన్లు చేసే
సంతాల్ పిల్ల మొహం లా మెరుస్తుంది.
ఆటుపోట్లతో అల్లకల్లోలంగా వున్న యీ సరస్సు
ముసలి అరబ్ డాలర్ల సుడిగుండంలో చిక్కుకొని
తల్లడిల్లుతున్న అమీనా పసిగుండెను గుర్తుచేస్తుంది.
క్రూరంగా విరుచుకుపడే కెరటాల మీద
చుండూరు శవాలు కొట్టుకొస్తున్నట్లనిపిస్తుంది.
నాగరికుల చూపుల్లో నగ్నీకృతమైన అలల్లో
వంకుర్తి ద్రౌపది సిగ్గుతో బిక్కచచ్చిపోవడం కనిపిస్తుంది.
సముద్రంలా ఘూర్ణిల్లే సరస్సు హోరులో
భద్రాచలం అడవుల్లోని తూటా మింగిన కేక వినిపిస్తుంది.
ఎక్కడో పగిలిన మృత్యువేణువులోంచి
చీకటి పాటల అలలు నా మొహమ్మీదికి వీస్తాయి.
అందరి అందాల చూపులు
విలాసంగా ఎగరేసిన బెలూన్లలా తేలివస్తుంటే
ఆలోచనల బరువుతో కదలలేని నా చూపు
అమాంతంగా హుసేన్ సాగర్లో మునిగిపోతుంది.

—దిలావర్